ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

- చిలుకూరు నుంచి బేతవోలు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం
- 8కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.16కోట్లు మంజూరు
- ఇప్పటికే పూర్తికావచ్చిన కల్వర్టు పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రం నుంచి బేతవోలు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కొన్ని రోజులు పనులు నిలిచినప్పటికీ తిరిగి మళ్లీ ప్రారంభమయ్యాయి. బేతవోలు వెళ్లే రోడ్డు ప్రస్తుతం సింగిల్ లైన్‌గా ఉండడంతో ఆ రోడ్డును డబుల్ లైన్‌గా మార్చనున్నారు. ఈ రోడ్డును డబుల్ లైన్‌గా విస్తరించాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. దీంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అందుకు స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మండల కేంద్రం నుంచి బేతవోలు వెళ్లే సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయించారు. కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిపై నుంచి చిలుకూరులోని బేతవోలు క్రాస్‌రోడ్డు నుంచి బేతవోలు వరకు 8కిలోమీటర్ల మేర రూ.16కోట్ల ఆర్ అండ్‌బీ నిధుల నుంచి మంజూరు చేయించారు. దీంతో పనులను సంబంధిత కాంట్రాక్టర్ ముమ్మరంగా చేయిస్తున్నారు.

మొత్తం 10మీటర్ల వెడల్పులో నిర్మాణం..

సింగిల్ లైన్ నుంచి డబుల్ లైన్ రోడ్డుగా మారనున్న బేతవోలు రోడ్డు ప్రస్తుతం 7మీటర్ల మేర బీటీ ఉంది. బీటీతో పాటు ఇరుపక్కల 3మీటర్లు (ఒక్కో పక్క మీటర్‌న్నర) మట్టి రోడ్డు ఉంటుంది. ఇప్పుడు మొత్తం 10మీటర్ల వెడల్పులో రోడ్డును విస్తరించనున్నారు. ఈ రోడ్డు 8కిలోమీటర్లు పరిధిలో 15 వరకు కల్వర్టులు ఉన్నాయి. కాగా కల్వర్టు పనులు కూడా దాదాపుగా పూర్తికావచ్చాయి. కల్వర్టుల నిర్మాణం పూర్తైన వెంటనే సింగిల్ లైన్ రోడ్డును తీసివేసి డబుల్ లైన్‌కు మెటల్ వేసి అనంతరం బీటీ వేయనున్నారు.



ముమ్మరంగా సాగుతున్న చిలుకూరు - బేతవోలు రోడ్డు నిర్మాణ పనులు

బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు మరో రూ.8కోట్లు మంజూరు..

అదే విధంగా బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు 3కిలోమీటర్ల సింగిల్ లైన్ రోడ్డు ఉంది. ఈరోడ్డును కూడా డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు ఆర్‌అండ్‌బీ నిధులు రూ.8కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పూర్తయ్యి టెండర్ల దశలో ఉంది. టెండర్లు పూర్తిగానే పనులు ప్రారంభం కానున్నాయి.

పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి



బేతవోలు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టులు దాదాపు పూర్తి చేశాము. రోడ్డు వెడల్పుకు అడ్డుగా ఉన్న కంప చెట్లు తొలగించాం. ఈ రోడ్డుకు రూ.16కోట్లు నిధులు మంజురయ్యాయి. అలాగే బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు 3కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.8కోట్లు మంజూరయ్యాయి. 5నెలలో పనులు పూర్తి చేస్తాము.

– బుడిగె సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, చిలుకూరు

తప్పనున్న వాహనదారుల ఇబ్బందులు..

ప్రస్తుతం సింగిల్ లైన్‌గా ఉన్న రోడ్డులో ప్రయాణం సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే తొలగడానికి చాలా కష్టంగా ఉంటుంది. ఈ రోడ్డులో నిత్యం మండల పరిధిలోని బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, పోలేనిగూడెం, కొండాపురం, మాధవగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణాలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఎట్టకేలకు రోడ్డు పనులు పూర్తికావడంతో తమ ఇబ్బందులు తప్పనున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

మఠంపల్లిలో ఇనుపయుగపు ఆనవాళ్లు గుర్తింపు

మఠంపల్లి : మండల కేంద్రంలో ఇనుపయుగపు ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గురువారం మఠంపల్లిలోని పాత శివాలయానికి వెళ్లే రోడ్డు పక్కన గల 12అడుగుల ఎత్తు, 5అడుగుల వెడల్పు, 6అంగుళాల మందం ఉన్న నిలువురాయి (స్మారకశిల)ను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అహోబిలం కరుణాకర్, నసీరుద్దీన్, చంటి ఇచ్చిన సమాచారంతో హుజూర్‌నగర్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది సాముల రామిరెడ్డి సహకారంతో పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మఠంపల్లి క్రీపూ.1000ఏళ్లనాటి ఇనుప యుగపు స్థావరమని అన్నారు. ఆ కాలంలో మరణించిన వారిని ఒక గుంటలో పూడ్చి పైన మట్టితో కప్పి గుర్తుగా ఒక స్మారక శిలను నిలిపే ఆచారము ఉండేదన్నారు. పురావస్తు, చారిత్రక ప్రాధాన్యం గల ఈనిలువురాయిని కాపాడుకోవాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. తనకు సహకరించిన హైకోర్టు అడ్వకేట్ సాముల రామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నిలువురాయిని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

9నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను ఈనెల 9నుంచి 13వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ సందర్భంగా గురువారం ఆలయ చైర్మన్ సింగారపు సైదులు, ఈఓ నాగెళ్ల శంభిరెడ్డి స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 9న సాయంత్రం 6గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, నిత్యహోమం, బలిహరణ, 10న సుప్రభాతసేవ, మండపారాధన, అర్చన, గంధంతో విశేష అలంకరణ, 11న అష్టోత్తర కలశ స్నపన, మన్యసూక్తహోమం, సుదర్శన మూలమంత్రహోమం, విష్ణుసహస్రనామ పారాయణం, నీరాజనమంత్ర పుష్పం, 12న హోమం మహాపూర్ణాహుతి, శ్రీస్వామి అమ్మవార్లకు ఎదుర్కోళ్లమహోత్సవం నిర్వహించి శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 13న రథోత్సవం, రాత్రి పవళింపు సేవను నిర్వహిండం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు కంచాల వీరారెడ్డి, ఉబ్బెపల్లి సైదులు, పుట్టపాకుల మల్లేశ్వరి, ఐతగాని శివయ్య, ఆలయ అర్చకులు, ఎక్స్‌అఫీషియో మెంబర్ నరగిరినాధుని రామకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాల తొలగింపులో భాగంగా బేతవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చేనేత రంగాన్ని ఆదరిద్దాం



చేనేత హస్తకళ ప్రదర్శనను ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు

కోదాడరూరల్ : సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింపజేసే చేనేత రంగాన్ని ఆదరిద్దామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. గురువారం పట్టణంలోని హుజూర్‌నగర్‌రోడ్‌లో గల టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసి చేనేత హస్తకళ ప్రదర్శన, అమ్మకాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులను విక్రయిస్తున్న చేనేత వస్తువులపై ప్రజలు మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో శ్రావణ్‌చౌదరి, వినోద్‌కుమార్, వంగవీటి గురుమూర్తి, పబ్బా గీత, జగిని ప్రసాద్, గరిణే శ్రీనివాసరావు, మధు తదితరులు ఉన్నారు.

సాయి మందిరంలో పూజలు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన



సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు : మండలంలోని పాలెఅన్నారం గ్రామపరిధిలోని 133 సర్వే నంబర్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గురువారం రెవెన్యూ, డీఆర్‌డీఏ, సోలార్ ప్లాంట్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 4ఎకరాలు ప్రభుత్వ భూమి కెటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పరిశీలించిన వారిలో తహసీల్దార్ ధృవకుమార్, ఏపీడీ సురేష్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐ మంత్రిప్రగడ సీతరామచందర్‌రావు, సీసీ స్వరూప, సోలార్‌ప్లాంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా మందిరంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో గల షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం మండల కేంద్రానికి చెందిన అలుగుబెల్లి చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం అతడి కుటుంబ సభ్యులు సుశీలమ్మ అన్నదాన వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో దేవరపల్లి మల్లీశ్వరి, దేవినేని రవికుమార్, తొగరు సీతరాములు, చలపతి, నాగేశ్వరరావు, రాజేష్, వెంకటనారాయణ, శ్రీను, భక్తులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిలుకూరు : మండల పరిధిలోని రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కీతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి బహూకరించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పాఠశాల హెచ్‌ఎం ఎస్‌జీ శివకుమారీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం దాతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణయ్య మృతికి సంతాపం

చిలుకూరు : మండల కేంద్రానికి చెందిన సీపీఐ నాయకుడు పిల్లుట్ల పూర్ణయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పార్టీ నాయకులు దొడ్డా నారాయణరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేసి మృతదేహానికి నివాళులర్పించారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, అంజనేయులు ఉన్నారు.

కులగణన దేశచరిత్రలోనే చారిత్రాత్మక ఘట్టం



హుజూర్‌నగర్ : రాహుల్‌గాంధీ, రాష్ట్ర మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచే చారిత్రాత్మక ఘట్టం అని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ రావు, టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ అజీజ్‌పాషా అన్నారు. బీసీ కులగణన విజయవంతం చేసినందుకు గాను గురువారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసి చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.రవికుమార్, జె.మల్లయ్య, ఎస్.సుబ్బరాజు, అమర్‌నాథ్‌రెడ్డి, జె.నరేందర్, టి.రాజా, కె.వెంకటేశ్వర్లు, సైదులు, యలమంద, శంభయ్య, పుల్లయ్య, గోవిందరావు, శీను, పెద్దబ్బాయి, ముస్తఫా, శివ, క్రాంతికుమార్, యూసుఫ్, వెంకటేశ్వర్లు, లాలు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

చిలుకూరు : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ఇచ్చినందుకు గాను మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ప్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. బీసీలకు డిక్లరేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కిందన్నారు. బీసీ కులగణనపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ యడవెల్లి పుల్లారావు, మాజీ ఎంపీపీలు బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు అలసకాని వెంకటయ్య, సొందుమియా, కొడారు బాబు, వట్టికూటి నాగయ్య, రాయభారపు వెంకటేశ్వర్లు, మండవ చిన్నా, గన్నా అశోక్, కొండా నరేష్, గురునాధం, బిట్టు రామకృష్ణ, భద్రయ్య, శ్రీనివాస్, వీరబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరులో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చిరంజీవి మృతికి సంతాపం



మృతదేహంపై పూలమాల వేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య

కోదాడరూరల్ : మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన స్వేరో కన్వీనర్ బల్గూరి దుర్గయ్య సోదరుడు చిరంజీవి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి గణపవరంలో చిరంజీవి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడెమోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి వెంట బల్గూరి కాశయ్య, మైసయ్య, దుర్గయ్య, పిడమర్తి వెంకటేశ్వర్లు, మాతంగి ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న అప్పిరెడ్డి, పాల్గొన్న స్థానికులు

నడిగూడెం : ధ్యానం చేయడంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ధ్యాన నిపుణుడు బజ్జూరి అప్పిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ధ్యానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు పని ఒత్తిడితో అనేక మంది జబ్బుల పాలవుతున్నారు. కాబట్టి ప్రతి రోజు కొంతసమయం కెటాయించి, ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానం శ్వాస మీద ధ్యాస పెడితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటరత్నం, స్థానికులు ఉన్నారు.

మానవ ప్రగతికి సైన్స్ దోహదం



హుజూర్‌నగర్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తుమ్మ భాస్కర్

హుజూర్‌నగర్ : మానవ ప్రగతికి సైన్స్ దోహదపడుతుందని మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు మూఢ నమ్మకాలను నమ్మొద్దని, శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అదే విధంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు పీవీ దుర్గాప్రసాద్, కలకుంట్ల సైదులు, వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమాలలో కరస్పాండెంట్ పశ్యా శ్రీనివాసరెడ్డి అధ్యాపకులు బాల సైదులు, జక్కుల రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలు విడనాడాలి

మఠంపల్లి : విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడాలి.. శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీ, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, పెదవీడు జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో సైన్స్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ నెల 28న జరగనున్న జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక నాయకులు పీవీ దుర్గాప్రసాద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్‌కె సల్మా, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సీతారాంరెడ్డి మృతికి నివాళి

నేరేడుచర్ల : నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సీతారాంరెడ్డి మృతదేహాన్ని గురువారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు ఇంజమూరి రాములు, పోరెడ్డి నర్సిరెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ అధ్వర్యంలో..

సీతారాంరెడ్డి మృతదేహాన్ని గురువారం కాంగ్రెస్ నాయకుడు సాముల శివారెడ్డి సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, పాలకీడు మాజీ ఎంపీపీ భూక్య గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, నాయకులు కొణతం సీతారాంరెడ్డి, ఆదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీను, నర్సింహారావు, జాజిరెడ్డి తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి వేణుగోపాల్

హుజూర్‌నగర్‌రూరల్ : వారం రోజులకు మించి దగ్గు, జలుబు ఉంటే తప్పనిసరిగా సైట్ టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మండల పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుగోపాల్ కోరారు. గురువారం మండలంలోని వేపలసింగారంలో నిర్వహించిన నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏడు ఆరోగ్య ఉపకేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన క్యాంపులో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానితులకు, వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు 346మందికి పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 70మందికి సైట్ టీబీటెస్ట్, 107మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవడానికి పోషకాహార నిమిత్తం ఇద్దరు ఆరోగ్య కేంద్ర ఉద్యోగులు సీహెచ్‌ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణల ఆధ్వర్యంలో చికిత్స కిట్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నూర్జహాన్, పద్మ, రమేష్, మమత, శ్రీనివాస్, సావిత్రి, స్వరూప, విజయ్‌కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చత్రునాయక్, హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరలకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె వెంకటరెడ్డి

హుజూర్‌నగర్ : కేంద్రం వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు చట్టబద్ధత కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు నిధులు కేటాయింపులు పెంచాలన్నారు. రైతులకు, వ్యవసాయ రంగాని సంబంధించిన నిధుల విషయంలో గంత కంటే కోత పెట్టడం సరైంది కాదన్నారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ రంగాలకు నిధులు తగ్గించి, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రోత్సాహకాలు అందించే విధంగా బడ్జెట్ ఉందని ఆయన విమర్శించారు. సమావేశంలో నాయకులు ఆర్.వీరస్వామి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, శీలం శ్రీను, యోన, వీరమల్లు, వీరయ్య, వెంకట నారాయణ, లింగమ్మ, త్రివేణి, వెంకన్న పాల్గొన్నారు.

మీసాల కాశయ్య మృతి పార్టీకి తీరనిలోటు

పాలకవీడు : పాలకవీడు గ్రామ మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య మరణం సీపీఎం పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాశయ్య జ్ఞాపకార్థం పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన స్థూపాన్ని గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాశయ్య ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని కోరారు. పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఉద్యమాలతోనే ప్రజల ఆకాంక్షలు నెవేరుతాయన్నారు. ప్రజలకిచ్చిన హామీలను విస్మరిస్తే భవిష్యత్‌లో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంతప్రకాష్, ముషం నరసింహ, పగడాల మట్టేష్, గుర్రం ధనమూర్తి, రాఘవరెడ్డి, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, ఏసురత్నం, వీరభద్రం, యల్లయ్య, రాంరెడ్డి, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కాశయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి

గరిడేపల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆపార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల కోసం సీట్ల కోసం కాకుండా ప్రజల సమస్యలపై పోరాటం చేసి వాటి పరిష్కారం కోసం పనిచేసేది సీపీఐ పార్టీ మాత్రమేనని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు ఎడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, కుందూరు వెంకట్ రెడ్డి, పంగ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుంచి సాగునీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

మోతె : ఎస్సారెస్పీ కాల్వల ద్వారా పంటలకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. గురువారం మండల పరిధిలోని మామిళ్లగూడెంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సారెస్పీ సాగునీటిపై ఆధారపడి రైతులు వేల ఎకరాల్లో వరిసాగు చేశారన్నారు. వరినాట్లు పూరైన నాటి నుంచి ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గుంటగాని ఏసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు కక్కిరేణి సత్యనారాయణ, కిన్నెర పోతయ్య, కాంపాటి శ్రీను, బూడిద లింగయ్య, చర్లపల్లి మల్లయ్య, సోమగాని మల్లయ్య, దోసపాటి శ్రీను, కొండ భాస్కర్, షేక్ జహీనాబీ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ

మునగాల : మండలంలోని కలకోవ గ్రామంలో మంగళవారం రాత్రి సీపీఎం కార్యకర్తల దాడిలో గాయపడి సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్తలను ఆ పార్టీ మండల నాయకులు గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి పనస విజయ్‌కుమార్‌గౌడ్, చిర్ర ప్రదీప్‌కు తీవ్ర గాయాలు కాగా రెండురోజులుగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సంక్షిప్త సమాచారం

రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి

మునగాల : హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారికి సమాంతరంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ ఈమెయిల్ ద్వారా ప్రధాన మంత్రి మోదీకి గురువారం లేఖ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం హైదరాబాద్ -విజయవాడ రహదారి రద్దీగా మారుతుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కోదాడ, సూర్యాపేట మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే రద్దీ తగ్గే అవకాశం ఉంటుందని, 2025 రైల్వే బడ్జెట్‌లో ప్రతిపాదించాలని కోరారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

హుజూర్‌నగర్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పాటు కార్మికుల వేతనాలు పెంచాలని కార్మిక సంఘాల నాయకులు రైస్‌మిల్లర్లను కోరారు. గురువారం పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో కార్మిక సంఘాల నాయకులకు, రైస్‌మిల్లర్లకు మధ్యవేతనాల పెంపుపై చర్చలు నిర్వహించారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో చర్చలు వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

హుజూర్‌నగర్ : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని (ఈనెల 15న) ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు డి.రవీందర్‌నాయక్ కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ జయంతి రోజున నియోజకవర్గ కేంద్రంలోనే ఉత్సవాలు జరుపుకోవడం కాకుండా మండల కేంద్రాల్లో కూడా జరుపుకునే జిల్లాకు రూ.కోటి నిధులు కెటాయించాలన్నారు.

పాఠశాలకు సీబీఎస్‌ఈ అనుమతి

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రీన్‌ఉడ్ పాఠశాలకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ద్వారా అనుమతి లభించిందని పాఠశాల చైర్మన్ టి.లూర్థుమారెడ్డి, డైరెక్టర్ సరిత తెలిపారు. గురువారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రీ ప్రైమరీ నుంచి సెకండరీ ఎడ్యుకేషన్ వరకు సీబీఎస్‌ఈ గుర్తింపు వచ్చినట్లు వెల్లడించారు. సమావేశంలో కరస్పాండెంట్‌కృష్ణారావు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి ఉన్నారు.

బియ్యం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఆసోదు బాయమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం బాధిత కుటుంబానికి స్థానిక తిలక్‌నగర్ అంబేద్కర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు యోహాన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుడిబండలోగల అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలలో వారికి కావాల్సిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేయనుందన్నారు. ఆయన వెంట ఎండీ.రఫీ, అంగన్‌వాడీ టీచర్‌లు ఉన్నారు.